

..మరో అడ్డుకట్ట

కర్ణాటక రాష్ట్రం కృష్ణానదిపై మరో ఎత్తి పోతలు నిర్మించేందుకు పూనుకుంటుంది.

వివరాలు 8లో ▸



నకిలీ నోట్ల కలకలం

నకిలీ నోట్ల ముఠాలో అలంపూర్‌వాసులు ఉండటంతో కలకలం రేపింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.2 /24.1

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

గద్వాల క్రైం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. కుషాను కలెక్టర్ వల్లూరు క్రాంతి మర్యాద పూర్వకంగా కలిశారు. ఐదు రోజుల క్రితం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కె.కుషా బాధ్యతలు స్వీకరించారు. అందులో భాగంగా బుధవారం కలెక్టర్ జిల్లా కోర్టుకు వెళ్లి న్యాయమూర్తి చాంబర్‌లో కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అడిషనల్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

గద్వాల: జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా సీహెచ్ శ్రీనివాసులు నియామకం అయ్యారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్డీఓగా పనిచేస్తూ.. పదోన్నతిపై జిల్లాకు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషినల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) అపూర్వ చౌహాన్‌ను కలిశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తు, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆర్డీఓ రాములు, కలెక్టరేట్ అధికారులు ఆయనకు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు

గద్వాల క్రైం: జిల్లాకు ప్రభుత్వం మెడికల్ కాలేజ్ మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వ్యులు జారీ చేసింది. మెడికల్ కాలేజ్ మంజూరు చేయడం ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మొన్నటికి మొన్న నర్సింగ్ కళాశాల మంజూరు చేయడం, తాజాగా మెడికల్ కళాశాల మంజూరు కావడంతో విద్యార్థులు సంబరాల్లో మునిగిపోయారు.

ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టండి



గద్వాల: రాష్ట్ర ప్రభుత్వ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని, బీఆర్‌ఎస్ నేతల అవినీతి, అక్రమాలు, వైఫల్యాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాల డీకే అరుణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చనుగోనిపల్లి, కొత్తపల్లి, రేకులపల్లి, గుంటిల్లి, మధనపల్లి, ఈడిగోనిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి పాలనతో రాజ్యమేలుతున్నారని, తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేసీఆర్ కేవలం మాటలు చెప్పే ముఖ్యమంత్రి అని, క్షేత్రస్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని, ఆయన పాలన రాష్ట్రానికి అరిష్టమని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ దౌర్జన్యాలకు, అవినీతికి చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీజేపీ జైత్రయాత్రను ఎవరు అపలేరని, రాష్ట్రంలో పార్టీకి మంచి ఆదరణ ఉందని, భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం సంబంధాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, గడ్డం కృష్ణరెడ్డి, రామంజనేయులు, బండల వెంకట్రాములు, శ్రీనివాసగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాధాకృష్ణరెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

గద్వాల అర్బన్: బీసీ సంక్షేమ హాస్టళ్లలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాష డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏఓ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు హాస్టళ్లలో సీట్లు కేటాయించకపోవడంతో ప్రతి రోజు 30–40కి.మీ దూరం నుంచి పాఠశాలలకు రావడం ఇబ్బందికరంగా మారిందన్నారు. గద్వాల్‌లో మరో బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు అంజి, నర్సింహ్మ తదితరులు ఉన్నారు.

వేరుశనగ @ 7,669

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 759 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. క్వింటాకు గరిష్టం రూ.7,669, కనిష్టం రూ.4,619, సరాసరి రూ. 5629 లభించాయి.

పరిష్కారమయ్యేనా..?



అలంపూర్ మున్సిపాలిటీలోని చౌక్ బజార్‌లో వర్షానికి పొంగి పొర్లుతున్న డ్రెయినేజీ

మున్సిపాలిటీల్లో వేధిస్తున్న దీర్ఘకాలిక సమస్యలు

- అస్తవ్యస్తంగా మురుగు కాల్వలు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- ఇటీవల ఒక్కో మున్సిపాలిటీకి రూ.25 కోట్లు సీఎం కేటాయింపు
- సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజల ఆశలు

అలంపూర్: మేజర్ పంచాయతీల స్థాయి దాటి మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయినా దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందినా నిధుల లేమి సమస్యల పరిష్కారానికి చిక్కుగా మారుతోంది. పట్టణ ప్రగతితో పట్టణాల స్వరూపంలో కొంత మార్పు కనిపించినా.. ప్రత్యేక నిధులతో సుందీకరణకు బీజం పడినా డ్రైనేజీలు, అధ్వాన అంతర్గత రోడ్లు వంటి సమస్యలతో పుర ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవలే జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం కేసీఆర్ మున్సిపాలిటీలకు వరాలు కరిపించారు. ఈ నిధుల రాకతో అయినా సమస్యలు పరిష్కారమయ్యేనా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వేధిస్తున్న సమస్యలు

మున్సిపాలిటీల్లో ప్రధానంగా మురుగు, అంతర్గత రోడ్ల సమస్యలు వేధిస్తున్నాయి. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని 7వార్డులోని జమ్ములమడుగు కాలనీ ప్రధాన డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదు. మురుగు నివాస గృహాల మధ్యకు చేరుకొని దుర్వాసన వెదజల్లుతోంది. 9, 3 వార్డులోనూ మురుగు సమస్య వేధిస్తోంది.

➪ శాంతినగర్‌లోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కోయిల్‌దిన్నే, అంబేద్కర్ చౌరస్తా నుంచి వడ్డేపల్లి వరకు ఉన్న ప్రధాన రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పైపాడులోని 1, 2 వార్డుల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఆయా వార్డులోని కాలనీల రోడ్లు అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

➪ అయిజ మున్సిపాలిటీలో దుర్గనగర్, భరత్ నగర్, టీచర్స్ కాలనీ, నరసింహ్మ కాలనీ, గుర్రం దొడ్డి కాలనీ, బుడగజంగాల కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఆయా వార్డులోని కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

➪ అలంపూర్ మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలోనే అంతర్గత డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 10 కోట్లతో పనులు చేపట్టారు. దాదాపు ఐదేళ్లపాటు కొనసాగిన ఈ పనులు ఆ తర్వాత అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో అప్పటి నుంచి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపైకి చేరుతున్నాయి. వర్షాలు కురిస్తే చాలు డ్రైనేజీలు పొంగి నివాస గృహాల వద్దకు చేరుతున్నాయి.

ప్రత్యేక నిధులపైనే ఆశలు

జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిధులు కేటాయించారు. గత నెల 12వ తేదిన జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ భవనం, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో జిల్లాలోని మున్సిపాలిటీలపై వరాలు కురిపించారు. జిల్లా కేంద్రమైన గద్వాల మున్సిపాలిటీకి రూ. 50 కోట్లు, అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ మున్సిపాలిటీకి ఒక్కో దానికి రూ.25కోట్ల చొప్పన నిధులు కేటాయించారు. ఈ నిధులతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతోపాటు ఇతర అభివృద్ధి పనులకు వినియోగించుకోవడానికి మున్సిపల్ పాలక మండలి, అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నిధులు విడదలయ్యాక ఏ మేరకు సమస్యల పరిష్కారానికి వినియోగిస్తారో అనే సందిగ్ధత పుర ప్రజల మదిలో తొలుస్తోంది.

ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతాం



మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి ప్రణాళికతో ముందుకు వెళ్తన్నాం. కొత్త మున్సిపాలిటీకి ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించడంతో సందరీకరణ పనులు చేపడుతున్నాం. ఆయా వార్డులో దీర్ఘకాలిక సమస్యలను, అంతర్గత రోడ్లు వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాం. సీఎం కేసీఆర్ అదనంగా రూ. 25 కోట్లు కేటాయించడంతో ఆ మేరకు ప్రజా సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

– మనోరమ, మున్సిపల్ చైర్‌పర్సన్, అలంపూర్

ఆగుతూ.. సాగుతూ.. సుందరీకరణ పనులు

ఆయా మున్సిపాలిటీల్లోని అభివృద్ధి పనులు ఆగుతూ..సాగుతున్నాయి. అయిజ మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ రుణంలో భాగంగా రూ. 15 కోట్లు వచ్చాయి. రూ.6 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు, రూ.9 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులు చేపట్టారు. గద్వాలలో గతంలోనే డివైడర్ విత్ సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. ప్రస్తుతం ప్రత్యేకంగా కేటాయించిన రూ.2.40 కోట్ల వ్యయంతో డివైడర్‌ల నిర్మాణాలు చేపడుతున్నారు. అలంపూర్‌లో ప్రసాద్ స్కీంలో భాగంగా రూ.37 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం సుందీరకరణకు రూ.10 కోట్లు కేటాయించింది. డివైడర్ కం సెంట్రల్ లైటింగ్, మున్సిపాలిటీ నూతన భవనం, సీసీ రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీకి రూ.10 కోట్లు కేటాయించగా.. డివైడర్ కం సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నా ఆశించినంత వేగంగా పనులు ముందుకు సాగడం లేదు. కొంత పని చేయడం ఆ తర్వాత వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అయిజలోని చాకలిపేటలో డ్రైనేజీ లేక నిలిచిన మురుగు

హరితహారం లక్ష్యాన్ని సాధించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ హరితహారం లక్ష్యాలను సాధించాలని, జిల్లాలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ఎంపీడీఓలతో జరిగని సమావేశంలో హరితహారంపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక తయారు చేయాలని, గద్వాల నుంచి ఆయా మండల కేంద్రాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట ఇరువైపులా రెండు వరసలలో అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలంపూర్ చౌరస్తా నుంచి మున్సిపల్ పట్టణం వరకు ప్లాంటేషన్ సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా మూడు ఫీట్ల మొక్కలు నాటాలని, వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. మొక్కలు ఎన్ని, ఎక్కడ నాటుతారో.. వాటికి సంబంధించిన స్థలాలను గుర్తించి ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. హరితహారం కింద నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. పట్టణాలలో రోడ్లు, పార్కులు, కార్యాలయాలు, ఇళ్ల తదితర ప్రాంతాలలో మొక్కలు విరివిరిగా నాటాలన్నారు. సమన్వయంతో అధికారులు హరితహారాన్ని విజయవంతం చేయాలన్నారు. బీచుపల్లి పుణ్యక్షేత్రం పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ కవర్లు వినియోగం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అడిషినల్ కలెక్టర్ అపూర్వచౌహాన్, డీఆర్‌డీఏ ఉమాదేవి, జడ్పీ సీఈఓ ముషాయిదాబేగం, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి శ్వేతాప్రియదర్శిణి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

అలంపూర్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలోని ఇమాంపురంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డాక్టర్ ఎమ్మెల్యే అబ్రహం హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఉన్న అన్ని మతాల వారికి, కులాల వారికి సమన్యాయం చేస్తున్నారని, అన్ని వర్గాల వారి భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మసీద్ ప్రహరీ నిర్మాణానికి రూ. 5 లక్షల ప్రొసిడింగ్ కాపీని అందజేశారు.

వినతుల వెల్లువ

అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో అయిజ మున్సిపాలిటీకి చెందిన పలువురు కుల సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి చేయూతనివ్వాలని వినతిపత్రం అందజేశారు. అయిజ మున్సిపాలిటీలోని కమ్మరి శాతవాహన కమిటీ సభ్యులు కమ్యూనిటీ భవనానికి, ఉప్పరి సంఘం నాయకులు కమ్యూనిటీ భవనం షెడ్ నిర్మాణానికి తిక్కవీరేశ్వర్లు స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో జరిగే వివిధ క్రీడలకు జాతరలో డ్రెసింగ్ రూంలు, వేదికల కోసం వినతి పత్రం అందజేశారు. కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధుల కేటాయింపు పరిశీలిస్తామని, గౌరైల పంపిణీ జరిగే విధంగా చూస్తామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు.

నూతన ఆవిష్కర్తలకు అవకాశం

- ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్లు విడుదల
- ఉత్తమమైన వాటికి ప్రశంసాపత్రాలు, బహుమతులు

గద్వాల: సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన ఆవిష్కరణలకు అవకాశం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహిస్తుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ... రాష్ట్ర నూతన ఆవిష్కరణల సెల్ విభాగం ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. 2019 నుంచి మంత్రి కేటీఆర్ సమక్షంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 2023 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సామాజిక సమస్యలకు పరిష్కారం కనుగొనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు రైతులు, మహిళలు, విద్యావేత్తలు ఇలా ఎవరైనా పాల్గొనవచ్చు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

వాట్సాప్ చాలు...

ప్రాజెక్టు రూపకర్తలు తమ ఆవిష్కరణను కేవలం వాట్సాప్‌లోనే ఆగస్టు 5వ తేదీలోగా పంపాల్సి ఉంటుంది. ఆవిష్కరణలకు సంబంధించి ఆరు వాక్యాలు, రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియో, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫోటోలు, రూపొందించిన వారి పేరు, సెల్‌ఫోన్ నంబరు, ప్రస్తుత వృత్తి, పూర్తి చిరునామాను 91006 78543 నంబరుకు వాట్సాప్‌లో పంపించాలి. వచ్చిన దరఖాస్తుల నుంచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమమైనవి ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రదర్శన మేళా ఏర్పాటు చేసి వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తారు.

పోస్టర్లు విడుదల

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలకు సంబంధించిన పోస్టర్లును బుధవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి విడుదల చేశారు. అందరికీ అవకాశం కల్పిస్తున్నందున.. యువకులు, విద్యార్థులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీఓ రాములు, జడ్పీ సీఈఓ ముషాయిదాబేగం ఐటీశాఖ రమేష్, శాంతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనిశ్చితి.. అయోమయం

బీజేపీలో మార్పులతో జిల్లా నేతల్లో అంతర్మథనం

- ప్రజాసంగ్రామ యాత్రతో పలువురికి దగ్గరైన 'బండి'
- అధ్యక్ష పదవి తొలగింపుతో అభిమానుల్లో అసంతృప్తి
- కిషన్‌రెడ్డి, ఈటల వర్గీయుల్లో హర్షాతిరేకాలు
- అసంతృప్త నేతలకు కాంగ్రెస్ నుంచి ఆహ్వానం?



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో గెలిచి.. హ్యాట్రిక్ సాధించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ నేతలు ముందస్తుగానే ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు. ఇటీవల కర్ణాటకలో విజయం సాధించిన తర్వాత కాంగ్రెస్‌లో జోష్ నెలకొనగా.. ఆ పార్టీకి చెందిన నాయకులు సైతం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజాక్షేత్రంలో ఉంటున్నారు. కానీ, బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం తామే అని చెప్పుకొంటూ వచ్చిన బీజేపీలో కొంత స్తబ్దత నెలకొంది. ప్రధానంగా పార్టీలో సంస్థాగత మార్పులు చిక్కులు తెచ్చిపెట్టినట్లు తెలుస్తోంది. రోజురోజుకూ మారుతున్న రాజకీయ పరిణామాల క్రమంలో పార్టీలో అనిశ్చితి నెలకొనగా.. నాయకులు, కార్యకర్తలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నట్లు పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. ఎన్నికలకు ఐదారు నెలలు కూడా లేని సందర్భంలో బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడంపై ఆయన వర్గీయులు, అభిమానులు గుర్రుగా ఉన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఇదేక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన కిషన్‌రెడ్డి, ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్ వర్గీయుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాసంగ్రామ యాత్ర–2తో..

పాలమూరులోని అలంపూర్ నియోజకవర్గం నుంచి గతంలో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా రవీంద్రనాథ్‌రెడ్డి గెలిచారు. 1999లో మహబూబ్‌నగర్ ఎంపీగా జితేందర్‌రెడ్డి విజయం సాధించారు. 2012లో మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న రాజేశ్వర్‌రెడ్డి ఆకస్మిక మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ సమయంలో టీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరి పోటీ చేసిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2019లో ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పరాభావమే మిగిలింది. అయితే 2019లో మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించి మహబూబ్‌నగర్, మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి మెజార్టీ ఓట్లు పోలయ్యాయి. అలాగే కల్వకుర్తి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి ఆచారి రెండు పర్యాయాలు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్, మక్తల్, కల్వకుర్తితోపాటు పట్టు ఉన్న గద్వాల నియోజకవర్గంపై కమలదళం దృష్టిసారించింది. ఈ స్థానాలతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీజేపీ శ్రేణులకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ గతేడాది రెండో విడతలో చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్ర మంచి ఊపునిచ్చింది. అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం నుంచి యాత్ర ప్రారంభం కాగా.. గద్వాల, నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, మహబూబ్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల మీదుగా సాగింది. ఈ యాత్రతో బండి జిల్లాలో పార్టీ నేతలు, కేడర్‌కు దగ్గరయ్యారు. యాత్ర ముగిసిన తర్వాత కూడా క్రమం తప్పకుండా ఉమ్మడి జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో పర్యటించారు. బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశాన్ని రెండు రోజులపాటు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డి తరఫున పాలమూరులో ప్రచారం నిర్వహించి సక్సెస్ అయ్యారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా పలువురు నేతలతో ఆయనకంటూ ఒకవర్గం ఏర్పడింది. దూకుడు తత్వంతో ఆయన పెద్దమొత్తంలో యువతను అభిమానులుగా మార్చుకున్నారు.

సీనియర్.. సామాజిక నేపథ్యం

తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి జిల్లా నేతలతో సత్సంబంధాలు ఉన్నాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ ఆవిర్భావం తర్వాత కొన్నాళ్లు అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉంది. గతంలో కృష్ణానది తీరం నుంచి ఆయన తెలంగాణ పోరుయాత్ర నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రధానంగా జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు ఆయనతో ఎప్పటి నుంచో సన్నిహితంగా ఉంటూ ఆయన వర్గంగా ముద్రపడ్డారు. అలాగే బీజేపీ చేరికల కమిటీకి అధ్యక్షుడిగా ఉన్న ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈయన బలమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందినవారు కాగా.. ఆ కమ్యూనిటీకి చెందినవారు ఉమ్మడి జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ వర్గానికి చెందిన పలువురు నాయకులు, సంఘాల బాధ్యులు గతం నుంచి ఆయనతో సంబంధాలు కలిగి ఉన్నారు. బీజేపీలో చేరిన తర్వాత ఆయన పాలమూరులో పలుమార్లు పర్యటించారు. ఈ క్రమంలో ఆయనకంటూ ఒకవర్గం ఏర్పడినట్లు తెలుస్తోంది. అయితే తాజాగా పార్టీలో సంస్థాగత మార్పులతో కొందరిలో నిరుత్సాహం అలుముకోగా.. మరి కొందరిలో ఉత్సాహం నెలకొంది. ఎన్నికలకు ఐదారు నెలల సమయం లేదని.. ఈ క్రమంలో చేపట్టిన మార్పులు బీజేపీకి లాభమా.. నష్టమా అనే చర్చ పార్టీ శ్రేణుల్లో జోరుగా సాగుతోంది.

అసంతృప్త నేతలపై కాంగ్రెస్ కన్ను

బీజేపీలో ప్రస్తుత పరిణామాలను జిల్లాల వారీగా గమనిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం అసంతృప్త నేతలపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు బీజేపీ నేతలను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి 2012లో గెలుపొందిన బీజేపీ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని నేతలు సంప్రదించినట్లు సమాచారం. అలాగే ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని ఓ నియోజకవర్గానికి చెందిన కీలక నేతను పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిసింది. ప్రస్తుతం రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న క్రమంలో ఎవరు ఎటు వైపు వెళ్తారోననే అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ప్రజలకు సేవలందించడం వరం

గద్వాల: జిల్లా ప్రజలకు సేవలందించే అవకాశం తనకు భగవంతుడు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. జెడ్పీ పాలక వర్గం కొలువుదీరి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ సరితతో పాటు జడ్పీ సభ్యులను అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ.. ప్రజలకు అందించే సేవే గొప్పదని, పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉన్న నాయకుడికే భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. గద్వాల జిల్లాకు మొదటి జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నంత కాలం ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం, అభివృద్ధి పథకాలను తీసుకొచ్చి జిల్లాను ముందంజలో ఉంచేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. తాను చేస్తున్న ఈ ప్రయాణంలో జిల్లా ప్రజలు ఊహించిన దాని కంటే ఎక్కువగా ఆదరిస్తున్నారని, భవిష్యత్తులో సైతం ఇదే తరహా సహకారాన్ని అందించాలని కోరారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశం మరవలేనిదని, జిల్లా పరిషత్ సభ్యులతోపాటు అధికారులు తనకు సంపూర్ణ సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, సీఈఓ ముషాయిదాబేగం తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీచైర్‌పర్సన్ సరితను సన్మానిస్తున్న జెడ్పీ ఉద్యోగులు

క్లుప్తంగా

పాముకాటుతో మహిళ మృతి


పద్మమ్మ(ఫైల్)

గండేడ్: పాము కాటుతో మహిళ మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గండేడ్ మండల పరిధిలోని కొండాపూర్‌కి చెందిన సురక పద్మమ్మ కూలి పని చేస్తూ.. జీవనం సాగిస్తుంది. భర్త మృతిచెందడంతో ఉపాధి నిమిత్తం గజ్వేల్‌కు వెళ్లింది. అక్కడ ఓ గుడిసెలో ఉంటూ నిత్యం కూలి పనికి వెళ్లి వస్తుండేది. మంగళవారం గుడిసె వద్ద పాము కాటేసింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతిచెందింది. బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌లు మృతురాలి కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


దశరథ నాయక్ (ఫైల్)

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు తండాకు చెందిన కాట్రావత్ దశరథ నాయక్(40) బుధవారం తెల్లవారుజామున ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు సంవత్సరాల కిందట మృతుడి భార్య చనిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై గ్రామంలో తిరుగుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి సీతమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళీ వివరించారు.

లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని..

కొత్తకోట: వనపర్తి జిల్లా కొత్తకోటలోని ఓ లాడ్జిలో వ్యక్తి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా నందికొట్కూర్ మండలం కొనిదెల గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి(43)గా కొత్తకోటలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న మహేశ్వరి లాడ్జిలో అద్దెకు దిగాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గది నుంచి బయటికి రాకపోవడంతో సిబ్బంది వెళ్లి తలుపు తట్టినా తీయలేదు. దీంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం నవీన్‌రెడ్డి దగ్గర ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కొత్తకోటకు చేరుకున్నారు. నవీన్‌రెడ్డికి కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, అలాగే కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. కాగా నవీన్‌రెడ్డి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అని తెలిసింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య మరణం తట్టుకోలేక వృద్ధుడు..

మహబూబ్‌నగర్ క్రైం: భార్య మృతిని తట్టుకోలేక ఓ వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పాలమూరులో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని న్యూప్రేమ్‌నగర్‌కు చెందిన కలాల్ శ్రీనివాస్‌గౌడ్(60) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో రెండేళ్ల కిందట షుగర్ వ్యాధితో రెండు కాళ్లు తొలగించారు. అయితే జూన్ 20న అతని భార్య మాణిక్యమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి తీవ్ర మానసిక వేదనకు గురై బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో భార్య మరణం తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో డోర్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై శ్రీనివాస్‌గౌడ్ కొడుకు వెంకటేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

మద్యానికి డబ్బులివ్వలేదని..

నవాబుపేట: తాగుడుకు బానిసైన వ్యక్తి మద్యానికి డబ్బులు ఇవ్వలేదని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని చౌడూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొర్ర కృష్ణయ్య(39) తాగుడుకు బానిసై రోజూ తాగేవాడు. ఈ నెల 3వ తేదీన రోజులాగే మద్యం తాగి ఇంటికొచ్చాడు. అతని భార్య లక్ష్మితో మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని గొడవ పడ్డాడు. ఆమె డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో ఇంట్లో పడుకున్నాడు. లక్ష్మి మహిళా సంఘం సమావేశానికి వెళ్ళింది. ఆమె వచ్చేలోపు అతను ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి పడుకున్నాడు. తర్వాత భార్య వచ్చి చూడగా పురుగుల మందు వాసన వచ్చింది. ఆమె వెంటనే బంధువులకు సమాచారం అందించగానే వారు 108కు ఫోన్ చేశారు. అతన్ని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణయ్య బుధవారం మృతి చెందాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

కృష్ణానదిపై మరో అడ్డుకట్ట

కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో 24 గ్రామాలకు సాగునీరు లక్ష్యం

- భవిష్యత్‌లో జూరాలకు నీరు రావడం ప్రశ్నార్థకమే
- ఇప్పటికే నీళ్లు లేక మూతపడుతున్న ఎత్తిపోతల పథకాలు
- ప్రభుత్వం స్పందించకపోతే సాగునీటికి అపారనష్టం


ముడుమాల్ సమీపంలో కర్ణాటక పరిధిలోని కృష్ణానదిలో నిర్మిస్తున్న జల్ జీవన్ పథకం ప్రాజెక్టు

కృష్ణా: సాగునీటి విషయంలో ఎగువన ఉన్న కర్ణాటక ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా ప్రాజెక్టులు, బ్రిడ్జి కం బ్యారేజీలు నిర్మిస్తూ వస్తుంది. ఈ విషయంపై కొంతకాలంగా తెలంగాణ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా కేంద్ర జల వనరుల శాఖ స్పందించడం లేదు. ప్రస్తుతం కృష్ణా మండలంలోని ముడుమాల్ గ్రామం నది అటు వైపు కర్ణాటకలోని గంజిపల్లిలో మరో చిన్న నీటిపారుదల ప్రాజెక్టును నిర్మిస్తుంది. దీని నుంచి దాదాపు ఒకటి నుంచి రెండు టీఎంసీల నీటిని తరలించవచ్చు. ఈ కొత్త ప్రాజెక్టు రాయచూర్ జిల్లాలోని గంజిపల్లి నుంచి ఎరిగేర వరకు అన్ని గ్రామాలకు సాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై కర్ణాటక అధికారులు నదిలో పారే నీటిని తీసుకెళ్తున్నాం.. వీటికి ఎలాంటి అనుమతులు అవసరం లేదని వాదిస్తున్నారు. ఈ పారే నీరే తెలంగాణ ప్రాంతంలోని జూరాల ప్రాజెక్టుకు వచ్చేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2016లో కృష్ణానదిపై తెలంగాణకు 5 నుంచి 7 కిలో మీటర్ల దూరంలో కర్ణాటక ప్రభుత్వం గుర్జాపూర్ బ్రిడ్జి కం బ్యారేజీని నిర్మించింది. దీన్ని కర్ణాటకలోని పవర్‌ప్లాంట్‌కు అవసరం నిమిత్తం నిర్మించినట్లు వారు పేర్కొన్నారు. మరో పక్క భీమానదిపై తెలంగాణకు 7 కిలోమీటర్ల దూరంలో గతంలో నిర్మించిన గూడూర్ బ్రిడ్జి కం బ్యారేజీని మూడేళ్లుగా అప్‌గ్రేడ్ చేయడం ప్రారంభించారు. ఇలా ఇష్టానుసారంగా నదులపై బ్రిడ్జి కం బ్యారేజీలను నిర్మిస్తుండడంతో పాటు ప్రస్తుతం ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను కూడా అప్‌గ్రేడ్ చేయడం విశేషం. రెండేళ్లుగా ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును పెంచేందుకు పనులు ప్రారంభించింది. అక్కడి ప్రభుత్వం ఐదేళ్లుగా వారు ప్రణాళికబద్ధంగా సాగునీటిని వారికి కేటాయించిన దానికంటే అదనంగా వాడుకుంటూ మన రాష్ట్రానికి ఇబ్బందులు కలిగిస్తున్నారు.


మూతపడిన గుడెబల్లూర్ 2వ ఎత్తిపోతల పథకం

తెలంగాణలోని ఎత్తిపోతల పథకాలకు ఇబ్బందులు

ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ ప్రాంతంలోని నది తీరాన ఉన్న ఎత్తిపోతల పథకాలకు నీళ్లు అందక తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇప్పటికే పలు ఎత్తిపోతల పథకాలు మూతపడే అవకాశం ఉంది. ప్రధానంగా మండలంలోని భీమానదిపై ఉన్న కళహల్లి ఎత్తిపోతల పథకంకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుంది. కళహల్లి ఎత్తిపోతల పథకంలో 2,500 ఎకరాలు సాగు కావాల్సి ఉండగా ప్రస్తుతం 200 ఎకరాల్లో సాగవుతుంది. గుడెబల్లూర్ ఎత్తిపోతల పథకంలో 3వేల ఎకరాల భూమి సాగు కావాల్సి ఉండగా, కేవలం 850 ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేస్తున్నారు. రబీకి వచ్చే వరకు కేవలం 400 ఎకరాల్లో మాత్రమే వరి సాగుచేశారు. ముడుమాల్ ఎత్తిపోతల పథకంలో కూడా 3వేలకు పైగా సాగుకావాల్సి ఉండగా, కేవలం 300 ఎకరాల్లో ప్రస్తుతం సాగవుతుంది. ఆత్మకూర్ మండలంలోని అమరచింత ఎత్తిపోతల పథకంలో 4వేల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా కేవలం 1,200ఎకరాల్లో సాగవుతుంది. ఇందులో 1,090 మంది రైతులు ఉన్నారు. ఈ పథకం కింద అమరచింత, మస్తిపురం, ఖానాపురం, సింగంపేట, మూలమళ్ల, పామిరెడ్డిపల్లి గ్రామాలకు సాగు నీరు అందుతుంది. మొత్తం కృష్ణానది రాష్ట్రంలో అడుగుపెడుతున్న తంగిడి గ్రామం నుంచి మొదలుకుని జూరాల ప్రాజెక్టు వరకు మక్తల్, ఆత్మకూర్, మాగనూర్, కృష్ణా మండలాల్లోని 15 ఎత్తిపోతల పథకాల్లో 8,500 ఎకరాలు, జూరాల ప్రాజెక్టు ఎడమకాల్వ నుంచి 12వేల ఎకరాలు రబీలో వరి సాగు అవుతుందని ఐడీసీ వారి లెక్కలు చెబుతున్నాయి. దీంతో పాటు నది తీరంలోని రైతులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న పంపుల ద్వారా మరో 20 వేల ఎకరాల వరకు వరి సాగవుతుందని వ్యవసాయ అధికారుల అంచనా. కానీ పైన ఉన్న కర్ణాటక దిగువకు చుక్క నీరు కూడా వదలకుండగా అడ్డుకట్టలు వేస్తుంది. ఈ విషయంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు విజ్ఞప్తులు చేసినా, చివరకూ రైతులు ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆశ్చర్యం.


కర్ణాటకలో భీమానదిపై అప్‌గ్రేడ్ చేసిన గూడూర్ బ్రిడ్జి కం బ్యారేజీ

గూడూర్ బ్యారేజీ నీరు కంపెనీలకు

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంతో కర్ణాటక ప్రభుత్వం 3 నుంచి 4టీఎంసీల నీటిని నిల్వ ఉంచేందుకు గూడూర్ బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇటీవల ఆ ప్రాంతంలో రైల్వే బోగీలను తయారు చేసే కర్మాగారం ఏర్పాటు చేశారు. అందుకు అనుగుణంగా ఆ బ్రిడ్జి కం బ్యారేజ్‌ను అప్‌గ్రేడ్ చేసి నిల్వ ఉన్న నీటిని ఉపయోగించుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం పనులను ప్రారంభించింది. కొత్తగా పలు కంపెనీలు ఏర్పాటయ్యాయి. వాటికి కూడా నీళ్లు అవసరం కానుండడంతో భీమానది నీటిని ఉపయోగించుకుంటున్నారు.

కొత్త ప్రాజెక్టుతో 24 గ్రామాలకు తాగు, సాగునీరు

రాయచూర్ జిల్లాలోని గంజిపల్లిలో గల కృష్ణానదిలో చిన్ననీటిపారుదల ప్రాజెక్టు కింద 24 గ్రామాల్లోని చెరువులకు నీటిని విడుదల చేయడంతో పాటు నేరుగా సాగునీటిని అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధమైంది. కర్ణాటక ప్రభుత్వం ప్రతి సంవత్సరం కృష్ణానదిలో ఎక్కడో ఒక్కచోట ఏదో ఒక పేరుతో నది నీటిని తరలిస్తున్నా మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని తెలంగాణ ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ ప్రాజెక్టులను నిలిపివేయాలి



కర్ణాటక ప్రభుత్వం తక్షణమే అక్రమంగా నిర్మిస్తున్నా ప్రాజెక్టులను నిలపకపోతే తీవ్ర పరిణామాలుంటాయి. ఐదేళ్లుగా నదిలోని నీటిని తరలించుకపోవడంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ విషయంపై కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, మక్తల్

సాగునీటికి ఇబ్బందులు



కృష్ణా, భీమానదులపై ఎగువన ఉన్న కర్ణాటక ప్రభుత్వం ఎక్కడ పడితే అక్కడా బ్రిడ్జి కం బ్యారేజీలు ఏర్పాటు చేస్తూ పోతే భవిష్యత్‌లో తెలంగాణ రైతులకు సాగునీటి ఇబ్బందులు ఏర్పడుతాయి. కర్ణాటక ప్రభుత్వాన్ని అదుపు చేయకపోతే ఈ ప్రాంతంలోని ఎత్తిపోతల పథకాలకు, సొంతంగా ఏర్పాటు చేసుకున్న మోటార్లకు నీళ్లు అందవు.

– గుడిసె నర్సప్ప, రైతు ముడుమాల్, కృష్ణా మండలం

మిగులు జలాలను వాడుకోవాలి



కృష్ణా ట్రిబ్యూనల్ ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి భీమానది నుంచి 5 టీఎంసీలు నీటిని వాడుకునే అవకాశం ఉంది. ఈ విషయంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి భీమానదిపై ఓ చిన్నపాటి బ్రిడ్జి కం బ్యారేజీని ఏర్పాటు చేస్తే, ఈ ప్రాంత రైతులకు సాగునీటికి ఇబ్బందులు ఉండవు.

– చెన్నయ్యగౌడ్, ముడుమాల్, కృష్ణా మండలం

ప్రజాప్రతినిధులు ఆలోచించాలి



ఇప్పటికే కృష్ణానదిపై మన ప్రాంతానికి అతి సమీపంలో గుర్జాపూర్ బ్యారేజీని కర్ణాటక ప్రభుత్వం నిర్మించింది. ఇప్పుడు ముడుమాల్ సమీపంలో జల్‌జీవన్ ప్రాజెక్టును నిర్మిస్తున్నది. భీమానదిపై గూడూర్ బ్రిడ్జి కం బ్యారేజీని అప్‌గ్రేడ్ చేసింది. దీని మూలంగా మా మండలంలో ఎత్తిపోతల పథకాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుంది. ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలి.

– కర్రెప్ప, ముడుమాల్, రైతు, కృష్ణా మండలం

నకిలీ నోట్ల కలకలం

- కర్నూల్‌లో పట్టుబడిన ముఠా
- పట్టుబడిన వారిలో అలంపూర్ ప్రాంతవాసులు
- ఇటీవల వారితో లావాదేవీలు జరిపిన వారిలో గుబులు


నకిలీ నోట్ల ముఠాను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న కర్నూలు సీఐ శ్రీరాం (ఫైల్)

అలంపూర్: జిల్లాలో నకిలీ నోట్ల అలజడి రేగింది. కర్నూల్‌లో పట్టుబడిన ముఠా సభ్యుల్లో అలంపూర్ ప్రాంత వాసులు ఉండటంతో స్థానికంగా కలకలం రేపింది. అంతర్రాష్ట్రాలలో పట్టుబడుతున్న వివిధ కేసుల్లో ఈ ప్రాంతాలకు చెందిన వారి పేర్ల వినిపించడంతో స్థానికంగా ఆందోళనకు గురి చేస్తోంది. ఏపీలోని కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 4వ తేదీన నకిలీ నోట్లు చలామణి చేస్తున్న రెండు ముఠాలను పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ఎనిమిది మంది రెండు గ్రూప్‌లుగా ఏర్పడి రూ.30లక్షలు అసలు నోట్లు ఇస్తే.. రూ.90 లక్షలు నకిలీ నోట్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకోగా.. కర్నూల్ మండలం పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల పక్కన ఖాళీ వెంచర్‌లో ఒకరి నుంచి మరొకరు బండిల్స్ మార్చుకునే క్రమంలో రెండు గ్రూప్‌లను పోలీసులు పట్టుకున్నారు. ఇందులో ఒక ముఠా నుంచి రూ.87 లక్షలు, మరో ముఠా నుంచి రూ.16 లక్షల నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన వారిలో అలంపూర్‌వాసులు..

మొదటి ముఠాలో ఏపీలోని వారు ఉండగా, రెండో ముఠాలో అలంపూర్ మండలం క్యాతూర్ గ్రామానికి చెందిన జనుపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఇదే గ్రామానికి చెందిన చిన్ననాగన్న, చాకలి బ్రహ్మ, కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన కమ్మరి వీరేష్ ఆచారిలపై కేసులు నమోదయ్యాయి. రెండవ గ్రూప్‌లో ఉన్న నలుగురిలో ముగ్గురు వ్యక్తులు అలంపూర్ మండలం క్యాతూర్‌కి చెందిన వారు ఉండటంతో స్థానికంగా అలజడి రేగింది. వీరు గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడి నకిలీ కరెన్సీని స్థానికంగా చలామణి చేశారా అనే అనుమానాలు దారితీస్తోంది. పట్టుబడిన ఒకరిలో గ్రామంలో ఒక స్థాయి లీడర్‌గా గుర్తింపు ఉంది. దీంతో నకిలీ నోట్ల చలామణి విషయం బహిరంగం కావడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వీరితో లావాదేవీలు చేసిన వారిలో గుబులు మొదలైంది. తమకు అసలు నోట్లు ఇచ్చారా.. లేక నకిలీ నోట్లు అంటగట్టారా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సరిహద్దుపై పర్యవేక్షణ కరువు..

అంతర్ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న జిల్లాలో నిత్యం అలజడి రేగుతుంది. అంతర్ రాష్ట్రాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు కీలక కేసుల పట్టుబడిన వారిలో జిల్లాకు చెందిన ఆయా మండలాలకు చెందిన వార్లు పేర్లు వినిపిస్తున్నాయి. మద్యం, నకిలీ కరెన్సీ, హత్య, చోరీ ఇతర వ్యవహారాల కేసుల్లో ఈ జిల్లాకు చెందిన వారి పేర్లు పరిపాటిగా మారాయి. అదేవిధంగా జిల్లాలో నమోదయ్యే కేసుల్లో సైతం పలు కేసుల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పులువురి పేర్లు ఉంటున్నాయి. సరిహద్దు జిల్లాలో ఇలాంటి కేసులు నమోదు కావడం పరిపాటిగా మారింది. సరిహద్దులో నిఘా కొరవడంతో అంతర్ రాష్ట్రాలకు చెందిన వారు యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నట్లు స్థానికంగా విమర్శలు ఉన్నాయి. గత మూడు రోజుల క్రితం కర్నూల్‌కు చెందిన ఒక ముఠా మారణాయుధాలతో అలంపూర్ చౌరస్తాలోని కూడలిలో తిరగడంతో స్థానికులు, ఆయా గ్రామాల ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సరిహద్దు మండలాల పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపటితే ఇలాంటి సంఘటనలను ఆరికట్టడానికి కొంత మేరకు అవకాశం ఉంటుంది. వీటిని కట్టడి చేయడానికి సరిహద్దులోని పోలీసులకు కత్తిమీద సాముగా మారింది. 44వ జాతీయ రహదారి.. రెండు రాష్ట్రాల సరిహద్దు.. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తుండగా, చాలీచాలని పోలీసు సిబ్బందితో పూర్తి స్థాయి నిఘా సాధ్యపడడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. మరింత మంది పోలీసు సిబ్బందితో పకడ్బందీ నిఘా ఏర్పాటుచేస్తేనే ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గద్వాల మండలంలోని వీరాపురం గ్రామ స్టేజీవద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్నూల్ జిల్లా ఆదోని మండలం హోల్గాంద గ్రామానికి చెందిన వెంకన్న (50) ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం వీరాపురం గ్రామానికి వలస వచ్చాడు. కూలీ పనుల కోసం బుధవారం గట్టు మండలానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సాయంత్రం బైక్‌పై వీరాపురానికి వస్తున్నాడు. ఎర్రవల్లి నుంచి ధరూరు మండలం మన్నాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు, గద్వాల పట్టణంలోని దౌదర్‌పల్లికి చెందిన కిష్టన్న మద్యం తాగి బైక్‌పై గద్వాల వైపు వస్తున్నారు. అయితే నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ ఎదురుగా వస్తున్న వెంకన్న బైక్‌ను ఆంజనేయులు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గంట వ్యవధిలో చోరీ

- రూ.80వేలు దోచుకెళ్లిన దొంగలు

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటికి తాళం వేసి స్కూల్‌ఫీజు చెల్లించి వచ్చేలోపు గంట వ్యవధిలో చోరీ చేసి రూ.80వేలు దోచుకెళ్లిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ ఏరియాలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ పవీణ్‌కుమార్ కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ ఏరియాలో సాఖ్య అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న అనిల్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి పిల్లలకు స్కూల్ ఫీజు కట్టేందుకు వెళ్లాడు. 4.30 గంటలకు ఇంటికి వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం బద్దలు కొట్టి బీరువాలోని రూ.80వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఆ క్రమంలో ఇంట్లోని వస్తువులను కింద పడేశారు. అదే ఫ్లోర్‌లో మరో ఇంట్లో చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ప్రాణం తీసిన భూ తగాదా


సంజీవరెడ్డి(ఫైల్)

వెల్దండ: మండల పరిధిలోని చెర్కూర్‌లో బుధవారం భూతగాదలో పోట్లాడుకోగా.. ఒకరు మృతిచెందారు. గ్రామస్తుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చెర్కూర్‌కి చెందిన ద్యాప సంజీవరెడ్డి(54)కి 4 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. పక్కనే తన పొలం ఉందని (సంజీవరెడ్డి మేనల్లుడు)శేఖర్‌రెడ్డి వచ్చి గొడవ పడ్డాడు. దీంతో మాటమాట పెరిగి ఇద్దరు పోట్లాడుకున్నారు. దీంతో సంజీవరెడ్డి కింద పడి అక్కడికక్కడే పొలంలోనే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు వివరించారు. మృతునికి భార్య పార్వతమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

చికిత్స పొందుతూ గురుకుల విద్యార్థిని మృతి


సంధ్యారాణి (ఫైల్)

గద్వాల క్రైం: తీవ్ర అనారోగ్యానికి గురై బుధవారం చికిత్స పొందుతూ కర్నూల్ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో విద్యార్థిని మృతి చెందింది. తల్లిదండ్రుల కథనం ప్రకారం... అయిజ పట్టణానికి చెందిన లాజర్ కూతురు సంధ్యారాణి(12) గద్వాల జిల్లా కేంద్రంలోని ఎంజేపీ టీబీసీడబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. రెండు రోజులుగా తీవ్రమైన తలనొప్పి, స్వల్ప అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందించింది. అయితే గత నెల 29న తండ్రి పాఠశాల వద్దకు వెళ్లి తన కుతూరు ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశాడు. అక్కడి సిబ్బంది ఎలాంటి అనారోగ్య సమస్య లేదని చెప్పారు. చదువుకునే క్రమంలో ఒక్కోసారి మీకు ఇబ్బంది ఉన్నట్లు చెప్పి ఉంటుందని అన్నారు. పాఠశాల సమయం కావడంతో లోపలికి అనుమతి లేదని చెప్పడంతో వెనక్కి వచ్చేశాడు. మళ్లీ ఈనెల 3వ తేదీన పాఠశాల యాజమాన్యం సంధ్యారాణి తండ్రి లాజర్‌కు ఫోన్ చేశారు. అమ్మాయికి జ్వరం ఉందని, మీరు ఇక్కడికి రావాలని చెప్పారు. దీంతో వెంటనే వెళ్లిన తండ్రి కూతురిని స్వగ్రామం అయిజకు తీసుకెళ్లి, ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూయించాడు. విషజ్వరం రావడం వల్ల పరిస్థితి విషయంగా ఉందని చెప్పడంతో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కూతురు మృతి చెందిందని ఆరోపించారు. సకాలంలో వైద్యం అందించి ఉంటే తన కుమార్తె బతికేదని వాపోయారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో స్థానికంగా వైరల్ అయ్యింది.

అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలుశిక్ష

మదనాపురం: రామన్‌పాడు లో 2022 సంవత్సరంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మచ్చన్‌షేక్ (48) అనే వ్యక్తి, ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో అతనికి 20ఏళ్లు జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ వనపర్తి పోక్సో కోర్టు జడ్జి శ్రీమతి సునీత బుధవారం తీర్పు ఇచ్చారు. పోక్సో కోర్టులో ఇది మొదటి తీర్పు అని వనపర్తి అదనపు జిల్లా కోర్టు పీపీ చంద్రశేఖర్ రావు తెలిపారు.

దాడి కేసులో నలుగురికి..

కోస్గి: వ్యవసాయ పొలం తగాదాలో జరిగిన గొడవకు సంబంధించి నమోదైన కేసులో, దాడికి పాల్పడిన నలుగురు నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ బుధవారం కోస్గి కోర్టు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పర్వీన్‌బేగం తీర్పు ఇచ్చారు. ఆ కేసు వివరాలు.. మద్దూర్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని బండగొండ గ్రామానికి చెందిన రైతులు అదే మండలంలోని భూనీడ్ శివారులోని వ్యవసాయ పొలాలకు సంబంధించి ఓ రైతుతో గొడవపడి దాడి చేశారు. దీంతో బాధితుని ఫిర్యాదుమేరకు దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై మద్దూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనేపథ్యంలో కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి, నిందితులైన నలుగురికి ఆరునెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


పెట్రోల్ బాటిల్‌తో వచ్చిన నర్సింహులు

రాజాపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి పెట్రోల్ బాటిల్‌తో వచ్చి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నవెల్లికి చెందిన కొందరు యువకులు రోడ్డు మధ్యలో వినాయక మండపం కోసం షెడ్ ఏర్పాటు చేస్తున్నారు. షెడ్ ఏర్పాటు చేస్తే వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు కలుగుతాయని, షెడ్ నిర్మించవద్దని గ్రామానికి చెందిన నర్సింహులు షెడ్ వేస్తున్న యువకులకు తెలియజేశాడు. దాంతో యువకులు తనపై దాడి చేశారంటూ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పనులు నిర్వహించవద్దని పోలీసులు గ్రామానికి చెందిన యువకులకు చెప్పి పని నిలిపివేశారు. దీంతో యువకులు మళ్లీ దాడి చేయడంతో బాధితుడు బుధవారం పెట్రోల్ బాటిల్‌తో వచ్చి పెట్రోల్ మీద పోసుకుంటుండగా అక్కడే ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు.

దళితుల సమాధులపైకి నీరు చేరనివ్వొద్దని నిరసన


ధర్నా వద్ద దళితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సువర్ణరాజు

చిన్నచింతకుంట: పట్టణంలోని ఊకచెట్టువాగు సమీపంలోని దళితుల సమాధుల మీదికి నీళ్లు చేరకుండా మట్టితో అడ్డుకట్ట వేయాలని ఆవేదన వ్యక్తం చేస్తూ.. బుధవారం చిన్నచింతకుంట దళితకాలినీలో ఆత్మకూర్, దేవరకద్ర రహదారిపై దళితులు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు కొండన్న మాట్లాడారు. ఊకచెట్టువాగుపై చెక్‌డ్యాం, కాజ్‌వే నిర్మాణం చేపడుతున్నారన్నారు. అందుకు ఊకచెట్టువాగులో వరద నీరు వచ్చినప్పుడు వాగు సమీపంలోని మా దళితుల పూర్వీకుల సమాధులపైకి నీరు చేరుతుందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి ఇదివరకే తీసుకెళ్లామన్నారు. అందుకు ఆయన స్పందించి సమాధులపైకి నీరు చేరకుండా మట్టితో ఆనకట్ట వేసేందుకు నిధులు మంజూరు చేయించారన్నారు. సర్పంచ్ దళితులపై మాపూర్వికుల సమాధులపై చిన్నచూపు చూస్తున్నాడన్నాడు. సమాధుల వద్ద ఆనకట్ట వేయకుండా అడ్డుకుంటున్నారన్నారని మండిపడ్డారు. ఆనకట్ట వేసేందుకు సహకరించాలని కోరితే ఆగ్రహంతో ఊగిపోతు దుర్భాషలాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి తహసీల్దార్ సువర్ణరాజు చేరుకుని సమాధుల వద్ద ఆనకట్ట వేసేందుకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. దళితులు యాకూబ్, రవి, డెవిడ్, పలువురు పాల్గొన్నారు.



అమరుల స్మారకానికి మరిన్ని మెరుగులు

త్వరలో దుబాయ్ నుంచి రానున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవలే కొత్తగా ప్రారంభమైన తెలంగాణ అమరవీరుల స్మారకానికి మరిన్ని మెరుగులు దిద్దేందుకు దుబాయ్ నుంచి త్వరలో నిపుణులు రాబోతున్నారు. ప్రధాన కాంక్రీట్ నిర్మాణం తర్వాత బయటి భాగాన్ని ప్రత్యేక జర్మన్ తయారీ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందించిన విషయం తెలిసిందే. స్టీల్ షీట్లను ప్రత్యేక పద్ధతిలో అతికించి రూపొందించారు. ఇందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని వాడి అతుకులు కనిపించకుండా, మొత్తం ఒకే స్టీలు రేకుతో రూపొందించినట్టుగా మార్చారు. భవనాన్ని ప్రారంభించే హడావుడిలో ఈ అతుకులను జాయింట్ చేసే పని పూర్తిస్థాయిలో చేయలేదు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో అతుకులు కనిపిస్తున్నాయి. వాటిని సరిచేయించాలని నిర్ణయించారు. ఇందుకోసం దుబాయ్ నుంచి నిపుణులు రాబోతున్నారు.

దుబాయ్ నుంచే ఎందుకు?

ఈ ప్రత్యేక స్టెయిన్‌లెస్ స్టీల్‌ను జర్మనీ కంపెనీ నుంచి కొన్నారు. కానీ, దాన్ని ప్రీకాస్ట్ చేసే పని దుబాయ్ కంపెనీకి అప్పగించారు. ఆ పరిజ్ఞానం స్థానికంగా లేకపోవటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దుబాయ్‌లో ప్రీకాస్ట్ చేసిన తర్వాత, వాటిని ముక్కలు చేసి హైదరాబాద్‌కు తెచ్చి అప్పట్లో బిగించారు. ఇప్పుడు అతుకులు కనిపించకుండా చేయటం, సొట్టలు పూడ్చటం కూడా స్థానిక నిపుణులు చేయలేనందున దుబాయ్ నుంచి పిలిపిస్తున్నారు.

నిర్వహణ బాధ్యత పురపాలక శాఖకు..

తెలంగాణ అమరవీరుల స్మారక భవనం నిర్వహణ బాధ్యతను పురపాలక శాఖకు అప్పగిస్తున్నారు. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ లేఖ రాసింది. నిర్మాణం, తదనంతర పనులు పూర్తవుతున్నందున నిర్వహణ బాధ్యత తీసుకోవాల్సిందిగా అందులో సూచించింది. గతంలో ఆ ప్రాంగణంలో ఉన్న లుంబినీ పార్కును హెచ్ఎండీఏ నిర్వహించింది. ఇప్పుడు దీని నిర్వహణ కూడా ఆ సంస్థకే అప్పగించనున్నారు. భవిష్యత్తులో మళ్లీ మరమ్మతులు చేయాల్సి వస్తే తాము చూస్తామని అ లేఖలో పేర్కొన్నారు. ఇక, ఎన్టీఆర్ గార్డెన్స్ పక్కన ఏర్పాటు చేసిన అంబేడ్కర్ భారీ విగ్రహ నిర్వహణ బాధ్యత చూడాల్సిందిగా ఎస్సీ అభివృద్ధి శాఖకు మరో లేఖ రాశారు. దాని వ్యయాన్ని ఆ శాఖనే భరించినందున నిర్వహణ కోసం లేఖ రాశారు.

త్వరితగతిన పోలవరం

పూర్తయ్యేలా చూడాలని ప్రధాని మోదీకి సీఎం జగన్ వినతి

- రూ.55,548.87 కోట్లకు ఆమోదించండి
- తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు..
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు గనుల కేటాయింపు..
- నూతన వైద్య కళాశాలలకు సహకారం
- రాష్ట్రాభివృద్ధికి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని వినతి
- హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌తోనూ సమావేశం



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విభజన హామీలు సహా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు, జాతీయ ఆహార భద్రత చట్టం అమల్లో హేతుబద్ధత, విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, నూతన వైద్య కళాశాలలకు ఆర్థిక సాయం తదితర అంశాలపై ప్రధానితో సుమారు గంటా ఇరవై నిమిషాలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని విన్నవించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా ఎంతో దోహద పడుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని, సుదీర్ఘ కాలంగా ఇది పెండింగ్‌లో ఉందని ప్రధాని నరేంద్రమోదీకి గుర్తు చేశారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు అవసరం అవుతుందని, ఇది కేంద్ర జల శక్తి శాఖ పరిశీలనలో ఉందని వివరించారు. తొలి దశ నిర్మాణానికి, కేంద్ర ఆర్థిక శాఖ ఇప్పటికే రూ.1,2911.15 కోట్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, అయితే తొలి దశలో భాగంగా మరో 36 గ్రామాల్లోని నిర్వాసితులకు సహాయ, పునరావాసం ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇది ఇస్తేనే తొలి దశ పూర్తవుతుందని వివరించారు. మొత్తంగా పోలవరం తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు ఇచ్చేలా జల శక్తి శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన తన సొంత నిధులు రూ.1,310.15 కోట్లను వెంటనే రీయింబర్స్ చేయాలని, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి ఆయా అంశాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ప్రధాని దృష్టికి సీఎం తీసుకెళ్లిన అంశాల వివరాలు ఇలా ఉన్నాయి.

సుదీర్ఘ కాలంగా బకాయిలు

- 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి ఏపీకి రావాల్సిన రూ.7,230.14 కోట్ల బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ జెన్‌కో ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా అవి త్వరగా వచ్చేలా చూడాలి.
- జాతీయ ఆహార భద్రతా చట్టం అమల్లో హేతుబద్ధత లోపించడంతో ఏపీ కన్నా ఆర్థికంగా ముందు వరుసలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు అధిక శాతం కవరేజీ ఉంది. ఈ పథకం అమలుకు ఎంచుకున్న ప్రమాణాల్లో హేతుబద్ధత లేదని నీతి ఆయోగ్ కూడా నిర్ధారించింది.
- హేతుబద్ధత లేనందున రాష్ట్రంలో 56 లక్షల కుటుంబాలకు కేంద్రం రేషన్ దక్కడం లేదు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.5,527 కోట్ల భారం పడుతోంది. ప్రతినెలా వినియోగించకుండా దాదాపు లక్ష టన్నుల బియ్యం కేంద్రం వద్ద ఉంటున్నాయి. ఇందులో 77 వేల టన్నులు రాష్ట్రానికి ఇస్తే సరిపోతుంది. దీనిపై మీరు (ప్రధాని) సత్వరమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
- ఏపీ పౌర సరఫరాల శాఖకు దీర్ఘకాలంగా (2012–13 నుంచి 2017–18 వరకు) పెండింగులో ఉన్న సబ్సిడీ బకాయిలు రూ.1,702.90 కోట్లను మంజూరు చేయాలి.

విభజన హామీలు నెరవేర్చండి

- రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రత్యేక హోదా సహా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా దోహద పడటం ద్వారా రాష్ట్రం స్వయం సమృద్ధి దిశగా ముందుకు అడుగులు వేస్తుంది. అందువల్ల ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్రం హామీ ఇచ్చింది. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో జీవనోపాధి మెరుగుపడడానికి, జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ ప్రాజెక్టు చాలా అవసరం. స్టీల్ ప్లాంట్‌కు అత్యంత అవసరమైన ముడి ఖనిజం కోసం మూడు గనులను ఏపీఎండీసీకి కేటాయించేలా కేంద్ర గనుల శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నాం.
- రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతి జిల్లాకు కనీసంగా 18 లక్షల జనాభా ఉంది. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు గతంలో ఉన్న 11 మెడికల్ కాలేజీలకు తోడు అదనంగా మరో 17 కళాశాలల నిర్మాణాలు చేపట్టాం. వీటికి తగిన ఆర్థిక సహాయం చేయాలి.
- సీఎం వైఎస్ జగన్.. ప్రధానితో భేటీకి ముందు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సుమారు 45 నిమిషాలపాటు, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పలు అంశాలపై చర్చించి, రాష్ట్రానికి సహకరించాలని కోరారు. కాగా, ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో సీఎంకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, రెడ్డెప్ప, ఆర్.కృష్ణయ్య, తలారి రంగయ్య, చింతా అనూరాధ తదితరులు ఘన స్వాగతం పలికారు. బుధవారం రాత్రి పర్యటన ముగించుకుని తిరిగి తాడేపల్లికి బయల్దేరారు.

సీఐడీ విచారణకు రామోజీ, శైలజా కిరణ్ డుమ్మా

సాక్షి, అమరావతి/నగరంపాలెం (గుంటూరు వెస్ట్): మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ప్రధాన నిందితుడు చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజాకిరణ్ బుధవారం సీఐడీ విచారణకు డుమ్మా కొట్టారు. కాగా.. ఈ కేసులో ఏ–3గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ 7 బ్రాంచ్ కార్యాలయాల మేనేజర్లు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కా ర్యాలయంలో విచారణకు హాజరయ్యారు. చందా దారుల నిధులను మళ్లించామని, ఇదంతా తమ ప్రధాన కార్యాలయం ఆదేశాలతోనే చేశామని వారు సీఐడీ విచారణలో వెల్లడించినట్టు సమాచారం. తమ సంస్థలో చాలా ఏళ్లుగా చేస్తున్నట్టుగానే తాము కూడా చేశామని.. అందులో తాము కేవలం పాత్ర ధారులమేననని.. పూర్తి నిర్ణయాధికారం తమ ప్రధాన కార్యాలయానిదేనని స్పష్టం చేసినట్టు సమాచారం.

నిరుపేదలకు భూమి

పదేళ్ల తర్వాత ఏపీలో పంపిణీకి సన్నాహాలు

సాక్షి, అమరావతి: సుదీర్ఘకాలం తర్వాత ఏపీలో నిరుపేదలకు వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ భూములు పంపిణీ చేయనుంది. 23 జిల్లాల్లో 54 వేల ఎకరాలను అర్హులైన పేదలకు పంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో అర్హులైన సుమారు 47 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఆయా జిల్లాల అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం కూడా దాదాపు పూర్తయింది. భూమి లభ్యతను బట్టి ఒక్కో లబ్ధిదారునికి ఒకటి నుంచి ఒకటిన్నర ఎకరం వరకు భూమి ఇవ్వనున్నారు. గ్రామాల్లో నిరుపేదలకు వ్యవసాయ భూములు ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఏడాది కిందటే కసరత్తు మొదలుపెట్టారు. అన్ని జిల్లాల్లో పేదలకు ఇవ్వడానికి అందుబాటులో ఉన్న భూమి, అర్హులైన లబ్ధిదారుల వివరాలతో నివేదికలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ల పరిశీలన తర్వాత 23 జిల్లాల్లోనే భూమి అందుబాటులో ఉన్నట్లు తేలింది. వైఎస్సార్, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆశాజనకంగా భూమి అందుబాటులో ఉండగా, మరో 8 జిల్లాల్లో వెయ్యి నుంచి 4 వేల ఎకరాల లోపు భూమి లభ్యత ఉన్నట్లు నిర్ధారణ అయింది. మరో 9 జిల్లాల్లో వెయ్యి నుంచి 2 వేల ఎకరాల భూమి ఉండగా, 4 జిల్లాల్లో వెయ్యి ఎకరాల లోపు భూమి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్లు నివేదికలు ఇచ్చారు. విశాఖ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో భూమి అందుబాటులో లేదు. త్వరలో మంత్రివర్గం భూ పంపిణీకి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో చివరిసారిగా 2013లో భూ పంపిణీ జరిగింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా | జస్టిస్ భూయాన్, జస్టిస్ ఎస్‌వీ భట్టి

▶ మొదటి పేజీ తరువాయి

సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో మూడు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాల్సి ఉండడంతో కొలీజియం ఇటీవల సమావేశమైంది. కేరళ సీజే ఎస్.వెంకటనారాయణ భట్టి, తెలంగాణ సీజే జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్లను కొలీజియం ఏకగ్రీవంగా సిఫార్సు చేసినట్లు సుప్రీంకోర్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తులుగా సీనియారిటీ, మెరిట్, పనితీరు వంటి అంశాలతోపాటు హైకోర్టుల ప్రాతినిధ్యం, అట్టడుగు వర్గాలు, సమాజంలో వెనకబడిన వర్గాలు, లింగ వైవిధ్యం, మైనారిటీల ప్రాతినిధ్యం వంటివి మూల్యాంకనం చేసి ఈ ఇద్దరు న్యాయమూర్తులను సిఫార్సు చేసినట్లు పేర్కొంది. 2022 ఆగస్టు నుంచి సుప్రీంకోర్టులో ఏపీకి ప్రాతినిధ్యం లేదు. ఈ నేపథ్యంలో మాతృ హైకోర్టు అయిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తుల్లో సీనియర్ అయిన జస్టిస్ భట్టిని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.

సమగ్రత, సామర్థ్యం ఉన్న జస్టిస్ భుయాన్

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ చట్టంలోని విభిన్న అంశాలపై అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. లా ఆఫ్ టాక్సేషన్‌లో ఆయన ఎంతో నైపుణ్యం ఉన్నవారని తెలిపింది. బొంబాయి హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో ట్యాక్సేషన్ సహా పలు కేసులు సమర్థంగా డీల్ చేసిన ఆయన సమగ్రత, సామర్థ్యం ఉన్న న్యాయమూర్తి అని పేర్కొంది. జస్టిస్ భుయాన్ 2011 అక్టోబరు 17న గౌహతి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ భట్టి అనుభవం అపారం


ఏపీ, కేరళ హైకోర్టుల్లో సుదీర్ఘకాలం పనిచేసిన జస్టిస్ భట్టి చట్టంలోని పలు అంశాలపై అపార అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. జస్టిస్ భట్టి తీర్పులే ఆయన న్యాయపరమైన యోగ్యతకు నిదర్శనమని తెలిపింది. జస్టిస్ భట్టి జ్ఞానం, అనుభవం సుప్రీంకోర్టుకు అదనపు విలువ అందిస్తాయని పేర్కొంది. జస్టిస్ ఎస్.వి.భట్టి 1962 మే 6న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. తల్లిదండ్రులు రామకృష్ణయ్య, అన్నపూర్ణమ్మ. మదనపల్లెలోని గిరిరావు థియోసోఫికల్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన బీసెంట్ థియోసాఫికల్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. బెంగళూరులోని జగద్గురు రేణుకాచార్య కాలేజీ నుంచి లా డిగ్రీ పొంది, 1987లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఇ.కళ్యాణ్‌రామ్ వద్ద న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, బీహెచ్ఈఎల్, బీఈఎల్, బీహెచ్‌పీవీ, ఆర్ఎస్‌వీపీ, నేషనల్ మారిటైం యూనివర్సిటీలకు న్యాయవాదిగా వ్యవహరించారు. 2000 నుంచి 2003 వరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా అప్పటి అడ్వొకేట్ జనరల్‌కు సహాయ సహకారాలు అందించారు. 2013 ఏప్రిల్ 12న అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హైకోర్టు విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా 2019లో ప్రమాణం చేశారు. అదే ఏడాది జస్టిస్ భట్టిని కేరళ హైకోర్టుకు బదిలీ చేస్తూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, న్యాయమూర్తులు జస్టిస్ సిక్రీ, జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ అరుణమిశ్రాలతో కూడిన కొలీజియం నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆయన ఈ ఏడాది ఏప్రిల్ 24న కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, జూన్ 1న పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

ముమ్మరంగా కసరత్తు



జక్రాన్‌పల్లి టౌన్: నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 8 నుంచి జరగనున్న 12వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ కప్ సాధించే దిశగా ఉమ్మడి జిల్లా బాలికల సబ్‌జూనియర్ జట్టు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. బాదేపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి కొనసాగుతున్న శిబిరంలో కోచ్ సోని ఆధ్వర్యంలో 25 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారు. ఎంపికైన బాలికలను రెండు జట్లుగా విభజించి పోటీలు నిర్వహిస్తూ శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని ఈ నెల 7న ఇక్కడి నుంచే నిజామాబాద్ పయనం కానున్నారు. జట్టుకు ఎంపికైన బాలికలకు స్థానిక బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో వసతి కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రూపాల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు గజానంద్, నగేష్ పర్యవేక్షిస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత?



గద్వాల: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత కాంగ్రెస్ పార్టీలో చేరడం దాదాపు లాంఛనమే అని తెలుస్తుంది. నెలరోజులుగా ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే విషయంపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నేతలను కలిశారని మీడియాలో కథనాలు రావడం, వాటిని సరిత ఎప్పటికప్పుడు ఖండిస్తున్నారు. అయితే వారం రోజులుగా అంతర్గత రాజకీయ సమావేశాలతో జిల్లా రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మూడు రోజుల క్రితం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత భర్త తిరుపతయ్య మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో సమావేశమైనట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు తిరుపతయ్య అంగీకరించినట్లు తెలుస్తుంది. మాజీ మంత్రి జూపల్లితో కలిసి ఈ నెల 20న కొల్లాపూర్‌లో జరిగే బహిరంగ సభలో ప్రియాంకగాంధీ సమక్షంలో చేరుతా రనే పుకార్లు వినిపిస్తున్నాయి. లేనిపక్షంలో కొల్లాపూర్ సభ తర్వాత గద్వాలలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కాంగ్రెస్‌లో చేరాలని సరిత భావిస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే నియోజకవర్గంలో పట్టున్న నాయకుడు, ఎమ్మెల్యే సమీప బంధువుతోపాటు పలువురు బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే పట్టణ, మండల స్థాయిలోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో రహస్య సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం.

కార్మికుల సంక్షేమం కోసం చేనేత ట్రస్టు

- నేత కార్మికులకు సబ్సిడీపై పరికరాలు
- ప్రభుత్వ చేనేత అభివృద్ధి కార్యదర్శి శ్రీనివాస్



చేనేత కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాస్

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం త్వరలోనే చేనేత ట్రస్టును ఏర్పాటు చేసి కార్మికులను అన్నివిధాలుగా ఆదుకునేందుకు ప్రణాళికను ప్రభుత్వ సిద్ధం చేసిందని ప్రభుత్వ చేనేత రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని బీసీ కమ్యూనిటీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం చేనేత జౌళీ శాఖ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా సీఎం కేసీఆర్ ప్రత్యేక సలహాదారు, చేనేత అభివృద్ధి కార్యదర్శి శ్రీనివాస్ హాజరై నేతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గురించి వివరించారు. చేనేత ట్రస్టును ఏర్పాటు చేస్తూ వాటి ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నదని వెల్లడించారు. కార్మికుల సంక్షేమం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని,రాష్ట్ర వ్యాప్తంగా చేనేత మగ్గాలను డిజిటలైజేషన్ చేసి జియో ట్యాగింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. నేతన్నకు చేయూత పథకం ద్వారా కార్మికులు బ్యాంకులో నెలసరి వేతనంలో 8శాతం డబ్బులను జమచేస్తే ప్రభుత్వ వాటగా 16శాతం డబ్బులను కార్మికుని ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. చేనేతమిత్ర ద్వారా నేతన్నలు లబ్ధి పొందుతున్నారని, రైతన్నలకు ఇచ్చే రైతుబీమా లాగా నేతన్నలకు చేనేత బీమా సౌకర్యాన్ని కల్పించిందన్నారు. మగ్గంపై ఆధారపడిన కార్మికుడిని గుర్తించి, వారికోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసి జియో ట్యాగ్ నంబర్ కేటాయించి ఆదుకునేందుకు కార్మిక సంఘాల నాయకులు, సొసైటీ సభ్యులు తమ బృందానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత జౌళీ శాఖ రీజినల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వెంకటేష్, టెస్కో ఓఎస్‌డీ రతన్‌కుమార్, చేనేత జౌళీశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలత, టెస్కో జనరల్ మేనేజర్ రఘునందన్ రావు, ఏడీ గోవిందయ్య, బుచ్చప్ప, ఏడీఓ రాజేశ్వర్ రెడ్డి, మహంకాళీ చంద్రమోహన్, పారుపల్లి సత్యన్న పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయడానికే పోటీలు



మాట్లాడుతున్న డాక్టర్ ఉత్తరాపల్లి రామాచారి

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యార్థుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, నైతిక విలువలను పెంపొందించి సృజనాత్మకతను వెలికితీయడం కోసమే తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 'కథ చెబుతారా.. ఊ కొడుతాం' పేరిట ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఉత్తరాపల్లి రామాచారి అన్నారు. మహబూబ్‌నగర్‌లోని పద్మాలయ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు భారత భాగవత, రామాయణం, భగవద్గీత, పంచతంత్ర కథలలో ఏదేని ఒక అంశంపై సంక్షిప్త (5 నిమిషాలకు మించకుండా) పోటీలు నిర్వహించి రెండు విభాగాల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ నెల 14న మహబూబ్‌నగర్ పట్టణం శ్రీనివాసకాలనీలోగల పద్మాలయ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి, 17న వనపర్తి జిల్లా కొత్తకోటలోని కొత్తకోట పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 10 గంటలకు, 19న నారాయణపేట జిల్లా ధన్వాడ బాలుర జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 10 గంటలకు, 20న గద్వాలలోని శ్రీదయానంద హైస్కూల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు, 25న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని శ్రీసరస్వతి శిశు మందిరం ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నం.93475 40005ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపల్ వంశీమోహన్‌రెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు కేశవులు, హన్మంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్‌కు బంగారు పతకం



పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ జాతీయ స్థాయి బంగారు పతకంకు ఎంపికయ్యారు. 2021– 22 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా రెడ్‌క్రాస్ ద్వారా అందించిన సామాజిక సేవలను గుర్తించి నటరాజ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా నటరాజ్ బంగారు పతకం అందుకోనున్నారు. ఈ మేరకు ఢిల్లీలోని రెడ్‌క్రాస్ ప్రధాన కార్యాలయం నుంచి జాతీయ సెక్రటరి జనరల్ ఆర్.కె.జైన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

జీఓ 46తో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం



స్టేషన్ మహబూబ్‌నగర్: జీఓ నంబర్ 46ను రద్దు చేసి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ జీఓ వల్ల నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 16,500 పోలీస్ పోస్టులు భర్తీ చేస్తున్న క్రమంలో మూడు నుంచి నాలుగు రకాల రాష్ట్ర స్థాయి పోస్టులు ఉన్నాయని, టీఎస్‌పీఎస్సీ తెలంగాణ స్టేట్ పోలీస్ పోస్టులు రాష్ట్రస్థాయి కేడర్ పోస్టులు అయితే జీఓ 46 ప్రకారం జిల్లాల్లో స్థానికత ఆధారంగా సెలక్షన్ చేస్తున్నారన్నారు. పోస్టులేమో రాష్ట్రస్థాయి పోస్టులైతే.. సెలక్షన్లు జిల్లాస్థాయిలో చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీంతో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ములుగు, సూర్యాపేట, నల్లగొండ, వికారాబాద్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి వంటి జిల్లాలకు ఎక్కువగా నష్టం జరుగుతుందన్నారు. వెంటనే 46 జీఓను రద్దు చేసి పాతపద్ధతిలోనే నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన మంత్రులు స్పందించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అభ్యర్థులు పాల్గొన్నారు.

పెరిగిన ఉల్లి ధరలు

- గరిష్టంగా రూ.1,840, కనిష్టంగా రూ.1,010



మార్కెట్‌లో ఉల్లిని తూకం వేస్తున్న హమాలీలు

దేవరకద్ర: ఒకపక్క టమాట, పచ్చిమిర్చి ధరలు రూ.వంద దాటి బెంబేలెత్తిస్తుంటే.. మరోపక్క ఉల్లి ధరలు సైతం ఎగబాకడం ప్రారంభమైంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి క్వింటాల్‌కు రూ.వెయ్యి అటు ఇటుగా ఉన్న ధరలు.. గత రెండు వారాలుగా పెరుగుతూ వస్తున్నాయి. జనవరి నుంచి జూన్ చివరి వారం వరకు ఉల్లి ధర రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు ఉండగా.. గత వారం క్వింటాల్ ఉల్లి ధర రూ.1,400 వరకు పెరిగింది. తాజాగా బుధవారం ఏకంగా రూ.1,840 వరకు ధర పలికింది. కేవలం రెండు వారాల్లోనే ఉల్లి ధర గరిష్టంగా రూ.600 వరకు పెరిగింది. ప్రస్తుతం ఉల్లి సీజన్ లేకపోవడంతో గత యాసంగి సీజన్‌లో పండించిన ఉల్లినే మార్కెట్‌లో అమ్మకానికి వస్తుంది. చాలామంది రైతులు ఇప్పటికే ఉల్లిని అమ్ముకోగా.. అక్కడక్కడ నిల్వ చేసుకున్న రైతులు ఉల్లిని తెస్తున్నారు. ఉల్లి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

జోరుగా వ్యాపారం..

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. మార్కెట్‌కు దాదాపు 500 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. క్వింటాల్ ఉల్లి ధర గరిష్టంగా రూ.1,840, కనిష్టంగా రూ.1,010 గా ధరలు పలికాయి. 45 కిలోల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.950 వరకు అమ్మకాలు సాగాయి. కనిష్టంగా రూ.500– 800 వరకు బస్తాగా విక్రయించారు. మార్కెట్ బయట చిరు వ్యాపారులు కిలో ఉల్లి రూ.20 వరకు అమ్మారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్లు వర్తింపజేయాలి



డైరీ ఆవిష్కరిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు

కందనూలు: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తింపచేయాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో బీసీ ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగుల పిల్లలకు క్రిమీలేయర్ ఎత్తివేయాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని, నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి 40శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, రెగ్యులరైజ్ కాకుండా మిగిలిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు ప్రభుత్వ కళాశాలలో పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు తక్కువ వేతనాలకే విద్యను బోధిస్తున్న గెస్టు లెక్చరర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. అంతకుముందు 2023 డైరీ ఆవిష్కరణ, పలు తీర్మాణాలు చేశారు. సమావేశంలో బీసీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీ కే వెంకటేశ్వరరావు, డి కాశన్న, ఉపాధ్యక్షులు పెద్దయ్య, నాగేశ్వరరావు, షహజాది బేగం, జి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి రాజయ్య, శ్రీ కొత్ర శ్రీనివాసులు పాల్గొన్నారు.



మా టీచర్ మాక్కావాలె!

ఇద్దరు టీచర్‌లను బదిలీపై పంపడంతో మా టీచర్ మాక్కావాలని విద్యార్థులు బోరున విలపించారు. ఈ సంఘటన బుధవారం మండలంలోని ఆశప్పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. గ్రామ యూపీఎస్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు, నర్సాపూర్ యూపీఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ విషయం తెలియడంతో బుధవారం చిన్నారులు మా టీచర్ ఇక్కడే ఉండాలని ఏడ్చారు. స్థానిక సీపీఎం నాయకుడు మాట్లాడుతూ పాఠశాలలో 110మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్‌లు మాత్రమే ఉన్నారని, వారిని బదిలీ చేయవద్దని కోరారు.

– దామరగిద్ద